విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

కె.ఆర్ పురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిగా సూర్యతేజ

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కె.ఆర్.పురం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ గా నియమితులైన యం.సూర్య తేజ శనివారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వారిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పరిధిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చురుకుగా అమలు చేసి, గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఓకు సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి వారిని ఐటిడిఎ పిఓ యం.సూర్య తేజ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

గూండారాజ్యానికి గుణపాఠం చెప్పాలి

విశాలాంధ్ర - లింగపాలెం : రాష్ట్రంలో గూండా రాజ్యం నడుస్తున్నదని తెలుగుదేశం నాయకులు విమర్శించారు. పుంగనూరులో మాజీ ముఖ్యమంత్రిపై, తెలుగుదేశం నాయకులపై వైసీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారని, ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే దారుణమైన చర్యగా పేర్కొన్నారు. లింగపాలెంలో శుక్రవారం రాత్రి తెలుగుదేశం నాయకులు మోరంపూడి మల్లికార్జునరావు, గరిమెళ్ళ చలపతి ఆధ్వర్యంలో పుంగనూరులో జరిగిన దాడికి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనపై ప్రజలు గుణపాఠం చెప్పే సమయం దగ్గరలోనే ఉందని ఆరోపించారు. గూండాయిజం, దౌర్జన్యకర చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వ విధానాలపై ప్రజలు స్పందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్ను శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిచక్ర వాహనం పంపిణీ

విశాలాంధ్ర - లింగపాలెం : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దివ్యాంగులైన వాలంటీర్ల కోసం ప్రవేశపెట్టిన త్రిచక్ర వాహనాల పంపిణీ పథకంలో భాగంగా ధర్మాజీగూడెంలో వాలంటీరుగా పనిచేస్తున్న ముత్తమ్మకు శనివారం త్రిచక్ర వాహనాన్ని అందించారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్టా సురేష్ పాల్గొని ఈ పథకంపై వివరించారు. రూ. 95 వేలు విలువ గల ఈ వాహనాలను సీఎం ఉచితంగా అందచేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి పథకాల ద్వారా పేదలు, ప్రతిభావంతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

సమన్వయం ఉన్నప్పుడే సమాజం బాగుంటుంది

విశాలాంధ్ర - లింగపాలెం : వైసీపీ అధికారంలో ఉన్నా ప్రతిపక్ష పార్టీల దౌర్జన్యాలే అధికంగా ఉన్నాయని చింతలపూడి నియోజకవర్గ ఎస్సీ సెల్ విభాగపు వైసీపీ నాయకుడు ముళ్ళపూడి సుమన్ అన్నారు. అయ్యపరాజుగూడెంలో శనివారం జరిగిన సమావేశంలో ఈయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తుందన్నారు. కొందరి ప్రవర్తన వల్ల అరాచకాలు జరుగుతున్నాయని అన్నారు. ఇటువంటి అరాచకాలను ప్రోత్సహించకుండా ఆయా పార్టీల పెద్దలు, నాయకులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భూషణం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల కోసం ఈనెల 7, 8 తేదీలలో ఏలూరులో జరిగే ధర్నాకు గ్రామ సహాయకులు హాజరుకావాలని ఈ సంఘ నాయకులు ఫకీరు, ఆనంద్ సురేష్(మణి) కోరారు. ధర్నా జరిగే రెండు రోజులు విధులకు హాజరుకాబోమని వీరు వెల్లడించారు. విధులను బహిష్కరిస్తున్నట్టు తహాశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం ముందుగానే స్పందించి సమస్యలు పరిష్కరిస్తే ధర్నాలు, ఆందోళనలు విరమిస్తామని వీరు పేర్కొన్నారు.

నులి పురుగుల నివారణకు మందులు వాడాలి

విశాలాంధ్ర - గణపవరం: స్కూలు విద్యార్థులు, పిల్లలు వైద్యులు అందజేసే నులి పురుగుల మందులు వాడాలని గణపవరం మండల అభివృద్ధి అధికారి గద్దల జ్యోతిర్మయి అన్నారు. శనివారం గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో నేషనల్ డి వార్మింగ్ డే మండల టాస్క్ ఫోర్స్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన నులిపురుగు మందులు పాఠశాలలో ఇస్తారని అవి పిల్లలకు ఇచ్చి వాటిని వాడే బాధ్యత ఉపాధ్యాయులుదని అన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం, పిప్పర పీహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ పిహెచ్ఆర్ సంతోష్ నాయుడు,డాక్టర్ కె ప్రియాంక, మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు, సిహెచ్ఓ జె విల్సన్ బాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కుంటుపడ్డ అభివృద్ధి

విశాలాంధ్ర-ముసునూరు: జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో గ్రామపంచాయితీల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని నూజివీడు నియోజక వర్గ టిడిపి ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబల్ల లక్ష్మి సత్యనారాయణ,పెదబాబు ఆధ్వ ర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముద్దరబోయిన మాట్లాడుతూ ఆర్అండ్‌బి రోడ్లు పూర్తిగా ధ్వంసంకాగా,కనీసం డ్రైనేజీలో మట్టితీసే పరిస్థితి లేదన్నారు.గ్రామాల్లో సచివాలయం,ఆర్‌బికే కేంద్రాలను చూపి ఇదే అభివృద్ధి అంటే ప్రజలు నమ్ముతున్నారా?అని అన్నారు. ఎన్నికల సమయంలో మద్యపానం రద్దు చేస్తానని చెప్పి డబ్బులు కోసం గ్రామాల్లో కూడా బెల్టు షాపులు పెట్టడం రాష్ట్ర అభివృద్ధా అనిప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు, సర్పంచ్ పులిబల్ల లక్ష్మిసత్యనారాయణ, బర్మా శ్రీనివాసరావు, కందుల పిచ్చియ్య, నామా సత్యనారాయణ పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-పెనుమంట్ర: ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు సెంటర్లో సి. ఎస్. ఆర్. ఐ. పోతురాజు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పక్కా సమాచారం అందడంతో శనివారం తనిఖీలు నిర్వహించగా అత్తిలి నుండి పెనుగొండ వెళ్ళుతున్న ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు మేలైన వైద్యం

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు శాసన సభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శనివారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పెదవేగి మండలం నవోదయ స్కూల్లో జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన పలువురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గుంయ్యారు. స్థానికంగా వైద్యాన్ని అందించే క్రమంలో విద్యార్థులకు జ్వరం ఉండటంతో వారికి మరింత మెరుగైన వైద్యకోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఆర్డిఓ కె. పెంచల కిషోర్, నూజివీడు డియస్పీ అశోక్ గౌడ్, డియంహెచ్ఓ డాక్టర్ నాగేశ్వరరావు, స్వయంగా జ్వరానికి గురైన విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్, జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి విద్యార్థులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యం. శశిధర్, ఛీఫ్ ఫిజీషియన్ డాక్టర్ పోతునూరి శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డాక్టర్ పిఆర్ఎస్ శ్రీనివాసరావులతో కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన వైద్య సేవలను వాకబు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పెదవేగిలోని జవహర్ నవోదయ స్కూల్లో క్రీడా పోటీల కోసం తమిళనాడు, హర్యానా, కేరళ, కర్నాటక తదితర ఐదు రాష్ట్రాల నుండి ఈ నెల 3వ తేదీన విద్యార్థులు వచ్చారన్నారు. ఈ నెల 4వ తేదీన స్పైసీ ఆహారం తీసుకోవడం వల్ల శుక్రవారం సాయంత్రం వాంతులు, కడుపునొప్పితో కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యార న్నారు. వెంటనే స్థానికంగా వైద్యం అందించడమే కాకుండా ప్రత్యే కంగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శుక్రవారం రాత్రి 3 గంటల వరకు అక్కడే ఉండి స్వయంగా వైద్య సేవలను పర్యవేక్షించారన్నారు. ఆసుపత్రిలో 74 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారన్నారు. దెందులూరు శాసన సభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యక శ్రద్ధ తీసుకున్నామని ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. పిల్లల తల్లి దండ్రులతో మాట్లాడామని, పిల్లలందరూ కూడా పూర్తిగా కోలుకొనే వరకు అన్నిజాగ్రత్తలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తహాశీల్దార్ బి. సోమశేఖర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల అస్వస్థతకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- అఖిలపక్ష పార్టీ నేతల డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: జవహర్ నవోదయ స్కూలు ప్రాంగణంలో వివిధ రాష్ట్రాల నుండి క్రీడా పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురవడం బాధాకరమని, దీనికి కారణమైన బాధ్యు లపై చర్యలు తీసుకోవా లని అఖిలపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్, జనసేన, ఆమ్ ఆద్మీ, బి ఎస్ పి తదితర పార్టీల నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి. కిషోర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర నాయకులు బద్దా వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, జిల్లా కార్యదర్శి తేజస్విని, ఆర్మీ పార్టీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, బిఎస్పి నాయకులు కె. అంబేద్కర్ తదితరులు మాట్లాడుతూ పెదవేగి మండలంలోని జవహర్ నవోదయ స్కూల్‌లో క్రీడా పోటీలలో పాల్గొనటానికి వచ్చిన కర్ణాటక, కేరళ, హర్యానా, తెలంగాణ తదితర రాష్ట్రాల విద్యార్థులు సుమారు 80 మందికి పైగా ఫుడ్ పాయిజన్ కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. విద్యార్థులు చెప్పిన దాన్ని బట్టి వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చిన విద్యార్థులకు వేరువేరు ఆహారపు అలవాట్లు ఉంటాయని వాటికి తగ్గట్టు ఆ విద్యాసంస్థల్లో ఆహారాన్ని అందించడంలో లోపం జరిగిందన్నారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులే కాకుండా ఇక్కడ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు కూడా అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో అస్వస్థత గురైన విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు వైద్య సదుపాయాలు కల్పించి, వారిని వారి స్వగృహాలకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుని పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సిపిఎం నగర కమిటీ సభ్యులు వి. సాయిబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ దండు బోయిన చంద్రశేఖర్ ,నగర కార్యదర్శి తాళ్లూరి చక్రవర్తి, సహాయ కార్యదర్శి సాకే బాబు, ప్రసాద్, జనసేన నాయకులు జనపరెడ్డి తేజ ప్రవీణ్, విద్యార్థి సంఘ నాయకులు దుర్గాప్రసాద్, నాని తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్ట్ కింద 151 గ్రామాలకు త్రాగునీరు

విశాలాంధ్ర -ఏలూరు : రూ.5 కోట్లతో 2021లో చేపట్టిన సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్ట్ కింద 151 గ్రామాలకు 4 లక్షల 52 వేల మందికి త్రాగునీరు అందించినట్లు జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ వెల్లడించారు. శనివారం ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశం జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆధ్వర్యంలో జెడ్పిటిసి, అధికారులతో మొత్తం 7 స్థాయి సంఘాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రూ.5కోట్లతో 2021లో చేపట్టిన సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్ట్ కింద 151 గ్రామాలకు 4 లక్షల 52 వేలమందికి జెడ్పి చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన రెండు మాసాల్లోనే త్రాగునీరు అందించినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్యం, పనులు, పారిశుధ్యం, జాతీయ ఉపాధిహామీ పథకం, వైద్యం, ఆరోగ్యం, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి తదితర అంశాలలో ఇప్పటి వరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలు, అధికారులద్వారా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ కె. రవికుమార్, సిపిఓ శ్రీనివాస్, ఇంఛార్జి డిఆర్ఓ జివివి సత్యనారాయణ, డిఎస్ఓ సత్యనారాయణ రాజు, సివిల్ సప్లయిస్ డియం మంజుభార్గవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సత్యనారాయణ, డిపివో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, తదితర ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు, జెడ్పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు టౌన్ రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్

విశాలాంధ్ర -భీమవరం: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ -23 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైల్వే డివిజన్ పర్యవేక్షకులు డిఈఎన్ ఈస్ట్ విజయవాడ కే శ్రీధర్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ అవరణలో రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల అధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ -23 పథక బ్రోచర్ ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ భారత దేశ రైల్వే దేశ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ ఈనెల 6న ప్రారంభిస్తామని, ఈ నేపథ్యంలో భీమవరం టౌన్ స్టేషన్ లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రతి స్టేషన్ లో అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు రైల్వే విడుదల చేస్తుందని, భీమవరం, నరసాపురం స్టేషన్లు ఎంపిక అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎపిఓ విజయవాడ కె.శ్రీనివాసరావు కార్యక్రమ ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో భీమవరం ఏడీఈఎన్ ఏ.శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ టి.సాంబశివరావు, సిఐ దస్తగిరి, జేఈ డి.మధుసూధన్ రెడ్డి, బి.ప్రసాద్, సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, జనపాటి మధుసుధన్‌రావు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు ఏంగెల్స్ కృషి

128వ వర్ధంతి సభలో అక్కినేని వనజ

విశాలాంధ్ర-తణుకు: ఆకలి, దారిద్ర్యం, అసమానతలు లేని సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు ఫ్రెడరిక్ ఏంగెల్స్ అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ శ్లాఘించారు. శ్రమ జీవుల రాజ్యస్థాపనకు బాటలు వేశారని కొనియాడారు. ఏంగెల్స్ 128వ వర్ధంతి సందర్భంగా కమ్యూనిస్టు సిద్ధాంతకర్తకు ఘనంగా నివాళులర్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా, తణుకులోని సీపీఐ కార్యాలయంలో ఏంగెల్స్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కినేని వనజ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం కారల్ మార్క్స్‌తో కలసి దాస్ కాపిటల్, కమ్యూనిస్టు ప్రణాళిక తరహా గ్రంథాలను రచించించారన్నారు. మార్క్స్, ఏంగెల్స్ సిద్ధాంతాల అమల చేయడంతో అనేక దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. సమాజంలో దోపిడీ, ఆర్థిక అసమానతలు ఉన్నంతకాలం మార్క్స్, ఏంగెల్స్ సిద్ధాంతాలకు మరణం లేదని ఆమె అన్నారు. కార్యక్రమంలో సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల బీమారావు, కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, బొద్దాని నాగరాజు, నెక్కంటి క్రాంతి కుమార్, కలిశెట్టి వెంకట్రావు, సికిలే పుష్పకుమారి, అప్పలస్వామి, సమితి సభ్యులు బొద్దాని కృష్ణకిషోర్, మల్లుల శ్రీనివాస్, మండల నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

9న 'క్విట్ కార్పొరేట్ -దేశ్ కి బచావో' జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఏలూరు : రైతులు, పేదలు, కుటీరపరిశ్రమలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను మోడి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని 9న క్విట్ ఇండియా డే సందర్భంగా "క్విట్ కార్పొరేట్- దేశ్ కి బచావో" నినాదంతో జిల్లావ్యాప్తంగా ఏలూరులోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. ఏలూరులోని ఐ.ఎఫ్.టి.యూ జిల్లా కార్యాలయంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు.ఈ సమావేశంలో బికెయంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏఐకెకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెట్టి సుబ్బన్న, ధర్మల సురేష్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, డి.చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, ఈ 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు ఐ.టి,ఎక్సైజ్, కస్టమ్స్,కార్పొరేట్ టాక్స్ ల పైన లక్షలాది కోట్ల రూపాయల రాయితీలను ఇస్తున్నదన్నారు. దేశ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగ విలువలను, లౌకిక తత్వాన్ని కాపాడుకునేందుకు ఆగస్టు 15న ప్రతిజ్ఞ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల. నాయకులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చిన భూములకు ఆన్‌లైన్ చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: అధికారులు పట్టాలు ఇచ్చిన భూములకు ఆన్ లైన్ చేయాలని కోరుతూ అల్లం చర్ల రాజు పాలెం గ్రామానికి చెందిన రైతులు స్థానిక తహసిల్దార్ కార్యక్రమంలో శనివారం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లం చర్ల రాజు పాలెం గ్రామంలో సర్వే నెంబరు 70లో గల 122 ఎకరాల్లో 84 ఎకరాల భూమిని 2005 సంవత్సరంలో 160 మంది రైతులకు ఒక్కొక్కరికి 50 సెంట్లు చొప్పున పట్టాలు ఇచ్చారని తెలిపారు. వారిలో కొందరికి ఆన్ లైన్ చేసి మిగిలిన వారి కి చేయక పోవడంతో రైతు భరోసా తో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మిగిలిన భూములకు సబ్ డివిజన్ చేసి ఆన్ లైన్ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బోళ్ళ రంగారావు, గజ్జిల్లి ములకయ్య,కత్తి వెంకటేశ్వరరావు, కాకర్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో సకలజనుల నిరసన దీక్ష

విశాలాంధ్ర-తణుకు: వేల్పూరు గ్రామంలో కుల వైషమ్యాలను పెంచి పోషిస్తున్న మంత్రి కారుమూరి వైఖరికి నిరసనగా శనివారం వేల్పూరు గ్రామ కూడలిలో మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సకలజనుల నిరసన దీక్ష నిర్వహించారు. ముందుగా ఎన్ టి ఆర్, బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగజీవన్ రావు, మహాత్మా జోతిరావు పులే చిత్ర పటాలకు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు.ఆరిమిల్లి రాధాకృష్ణ కు మునిసిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ పూలమాల వేసి ప్రారంభిం చారు. ఈ దీక్షలో వేల్పూరు గ్రామ ఆర్య వైశ్య, విశ్వబ్రాహ్మణ, శెట్టిబలిజ, అగ్నికుల క్షత్రియ, కాపు, ఎస్సి , కరికాల, దేవంగుల, కర్ణ భక్తుల, పద్మశాలి, రజకులు, నాయి బ్రాహ్మణ, దేవతిలుకుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పితాని సత్యనారాయణ, పాలకొల్లు శాసన సభ్యులు నిమ్మల రామానాయుడు, టీడీపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు, తణుకు నియోజకవర్గ అబ్జర్వర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణం వేగవంతం

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర- భీమవరం: జిల్లాకు సంబంధించిన 72,059 ఇళ్ళ నిర్మాణాల లక్ష్యానికి గాను 25,383 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామని, మిగిలిన ఇళ్లు కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యస్.జవహర్‌రెడ్డి విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో హౌసింగ్, రెవెన్యూ, పిఆర్‌ఆర్ డి, స్వమిత్వ, జాతీయ చేనేత దినోత్సవం, వ్యవసాయం, పశుసంరక్షణ, డెయిరీ డెవలప్‌మెంట్, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, ఆడుదాం ఆంధ్ర, వైయస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులులపై సమీక్ష నిర్వహించారు.స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కె.యస్. జవహర్ రెడ్డి ప్రాధాన్యత భవనాలు పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హౌసింగ్ కార్యక్రమం కింద స్టేజ్ కన్వర్షన్ పై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు.హౌసింగ్ లే అవుట్ లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి వివరాలు తెలియ చేస్తూ, జిల్లాలో 72,059 ఇళ్ళ నిర్మాణ లక్ష్యం కాగా 25,383 ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆడుదాం ఆంధ్రా కింద గ్రామ, వార్డు, మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయిలో 4 దశల్లో చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక ను అక్టోబర్ 2 నుంచి నవంబర్ 3 వరకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న పాల వెల్లువ కింద యూనిట్స్ గ్రౌండ్ చేసిన వివరాలు ఆన్లైన్ వెబ్సైట్ లో అప్లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా మన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : గర్భిణులు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలలో ఇచ్చే పోషక ఆహారాన్ని తీసుకోవడం ద్వారా చంటి పిల్లలకు మెరుగైన ఆరోగ్యం ఉంటుందని రాజవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య పేర్కొన్నారు. మండలంలో రాజవరం గ్రామంలో శనివారం అంగన్వాడి కేంద్రం వద్ద వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తుక్కయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్ చిన్నారు లకు బలమైన ఆహారాన్ని అందించాలనే దృఢమైన సంక ల్పంతో బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని, అంగన్వాడి కేంద్రం ద్వారా గుడ్డు, పాలు, పిండి పదార్థాలకు అవసరమయ్యే పిండిని ఖర్జూరం వంటి మంచి పోషణ గల ఆహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్ర టీచర్లు లీలా కుమారి, వసంతరాణి, వైసిపి నాయకులు టి. రెడ్డి, ఎస్.కె మస్తాన్, పండు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువతను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : క్రీడల్లో యువతను ప్రోత్స హించాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని పెయ్యేరు వైయస్సార్ కాలనీ యువకులకు ఎంపీపీ కార్యాలయం వద్ద వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామీణ యువకులను క్రీడల్లో ప్రోత్సహిస్తే భవిష్యత్తులో జాతీయస్థాయి క్రీడాకారులుగా రాణించగలరన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాల న్నారు. యువకులు కష్టపడి చదువుకుని క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దివి సతీష్ , మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు, నాయకులు సాక్షి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే ప్రజల్లో మంచి స్పందన

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగు తుందని ఇటువంటి ప్రభుత్వం మళ్లీ కావాలని ప్రజలు కోరు కుంటున్నారని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీని వాసరావు (వాసు బాబు) అన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 187వ రోజు నిడమర్రు మండలం, పెదనింద్ర కొలను గ్రామ సచివాలయం2 పరిధిలో ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేసినట్లు ఎమ్మెల్యే వాసు బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముగ్గళ్ళ యాకోబు,జడ్పిటిసి సభ్యులు కోడే కాశీ, ఎంపీపీ దనుకొండ ఆదిలక్ష్మి, వైయస్సార్ మండల పార్టీ కన్వీనర్ సంకు సత్య కుమార్, ఎంపీటీసీలు చినిమిల్లి నరసింహమూర్తి, బండి రమణ,తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో కన్నాయిగూడెం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం: మండలంలో పొంగుటూరు గ్రామ పంచాయతీ పరిధి కన్నాయిగూడెం గ్రామంలో గత వారం రోజుల నుంచి పంచాయతీ వీధిలైట్లు పనిచేయడం లేదని గ్రామం అంతా అంధకారంలో ఉందని గ్రామస్తులు తెలిపారు. అసలే వర్షాకాలం కావడంతో ఇండ్లలో నుండి బయటకు వెళ్లాలంటే పాముల భయం వెంటాడుతుందని, గ్రామం అంతా చీకటి మాయంగా మారిందని తమ గ్రామాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడా అని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచ్ ఇప్పటికైనా స్పందించి గ్రామంలోని విద్యుత్ వీధి దీపాలు వెలిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ మోదుగు సునంద తెలిపారు. టి నరసాపురం పంచాయితీలోని గండి గూడెం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు టేక్ హెూమ్ రేషన్ కిట్లను శనివారం ఆమె పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పది రకాల పౌష్టికాహార వస్తువులు పంపిణీ చేయడం ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అక్క చెల్లెమ్మలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లక్ష్మి, ఎంపిటిసిలు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య,అంగన్వాడీ కార్యకర్తలు ఇందుమతి,శుభరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **DARABATTULA MAHANKALI (New Name), S/o MUSALAYYA,** Previously Called **DARABATTULA TATA RAO (Old Name),** Resident of D.No. 5-37, Near No.2 Elementary School, Rayalam Village, Bhimavaram Mandal, West Godavari District, Andhra Pradesh, Pin-534208. Now Changed my Name from **DARABATTULA TATA RAO (Old Name)** to **DARABATTULA MAHANKALI (New Name).** Today onwards Use my New Name for all further Transactions.

రెవెన్యూ లీలలు

సాగు భూమిలో ఒకరు.. ఆన్‌లైన్ రికార్డులో మరొకరు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: 40 ఏళ్ల నుండి మేమంతా కలిసి భూమి సాగు చేసుకుంటుంటే రెవెన్యూ అధికారులు మరొకరికి ఆన్ లైన్ చేశారంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం పంచాయతీ పరిధిలో తాటి రామన్నగూడెం గ్రామానికి చెందిన కొంతమంది గిరిజనులు తమను అధికారులు మోసం చేశారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మమ్మల్ని అధికారులు మోసం చేశారని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన గడ్డం ముత్తయ్య వారసులకు 5 ఎకరాల భూమిని ఏ విధంగా ఆన్ లైన్ భూమిని ఏ విధంగా చేసుకున్నారో చెప్పాలని అధికారులను నిలదీస్తున్నారు. సర్వే నెంబర్ 95లో సబ్ డివిజన్ గా చేసి అధికారులు లంచాలకు కక్కుర్తి పడి ఆన్ లైన్ చేశారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. రికార్డు పరంగా ఆ భూమి మాకు చెందుతుందని ఆ భూములకు రావద్దు అని బెదిరిస్తున్నారని వాపోయారు. ఏళ్ల తరబడి మా గిరిజనులంతా సాగు చేసుకుంటుంటే వేరే వారికి ఆన్ లైన్ చేసి మా మధ్యన రెవిన్యూ అధికారులు గొడవలు పెడుతున్నారని గిరిజనులు వాపోయారు. ఇకనైనా మేము సాగు చేసుకుంటున్న భూములకు అధికారులు ఆన్ లైన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంజ సోమరాజు, సరియన్ సింగప్ప, కుంజా వెంకటేష్, మడకం ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

మేఘూలాదేవికి టైలర్స్ సంఘం శుభాకాంక్షలు

విశాలాంధ్ర కొయ్యలగూడెం : రాష్ట్ర మహిళా హక్కుల మిషన్ అధ్యక్షురాలుగా నియమితులైన గంగిరెడ్ల మేఘూలాదేవిని కొయ్యలగూడెం మండల విలియం హెూం గణపతి రామ టైలర్స్ సంఘ సభ్యులు కొయ్యలగూడెంలో మేఘూలదేవి ఇంటి వద్ద ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకొని, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేఘులాదేవి తెలుగుదేశం పార్టీలో రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పటి నుండి పార్టీ మారకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ నిరుపేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. ఆమెకు ఈ పదవి బాధ్యతలు అప్పచెప్పడం ద్వారా మహిళలందరికీ న్యాయం చేకూరుతుందని టైలర్ సంఘ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు తాడిగడప ఆంజనేయరాజు, చెప్పుల మధుబాబు, రమణ, కాసిం,విజేత టైలర్,స్వాగత్ టైలర్, సిరి టైలర్,స్వామి టైలర్, సోనీ టైలర్ డిస్కో టైలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులుగా బషీరుద్దీన్

విశాలాంధ్ర - గణపవరం: తెలుగుదేశం పార్టీ గణపవరం మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గణపవరం గ్రామానికి చెందిన షేక్ బషీరుద్దీన్ నియమితులైనట్లు ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు శనివారం తెలిపారు. ఏలూరులో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా మైనార్టీ సెల్ ఆత్మీయ సమావేశంలో ప్రకటించినట్లు తెలిపారు. మండల మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ సత్తార్ సాహెబ్, సెక్రటరీ రొంపిచర్ల కమురుద్దీన్, మరో ఏడుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వారికి ఈ పదవులు రావడానికి కృషి చేసిన ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి సీనియర్ నాయకులు యళ్ళ సుబ్బారావు, మండల టిడిపి అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు, గణపవరం టౌన్ అధ్యక్షుడు కూచంపూడి సురేందర్ రాజు,టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు షరీఫ్‌లకు మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు బషీరుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేత

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : తల్లి బిడ్డ ఆరోగ్యంగా దృఢంగా ఉండాలని సంకల్పంతో ప్రభుత్వం ఉచితంగా వైయస్సార్ సంపూర్ణ రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు బుట్టాయిగూడెం సిడిపిఓ ఇ. తులసి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వైయస్సార్ సంపూర్ణ రేషన్ ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఈ కిట్టులను ఉపయోగించినట్లయితే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. 11 రకాల పోషక విలువైన వాటిని ఉపయోగించినట్లయితే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు. మండలంలో గర్భిణీలు 180 మంది, బాలింతలు 168 ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే ఈ పోషక విలువలను సద్వినియోగం చేసుకోవాలని గర్భిణీలు బాలింతలకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సన్నం సురేష్, కోఆప్షన్ సభ్యులు బి. ప్రేమ్ కుమార్, ఉపసర్పంచ్ బొంతు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మహిళా అభివృద్ధికి కృషిచేసి, రక్షణ కల్పించాలని టిడిపి పట్టణ అధ్యక్షులు జేష్ట రామకృష్ణారావు అన్నారు. మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఎన్నికైన గంగిరెడ్ల మేఘూల దేవికి కొయ్యలగూడెం పట్టణ పార్టీ తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగాయని, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలను నిలదీస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి కేసు బాబు, దిద్ది పాల్, రాచూరి మదన్, నల్లూరి గోపి, సంకు కృష్ణ, కర్రీ అన్నవరం, కర్రీ గణేష్, కామేశ్వరరావు, షేక్ మస్తాన్, సూరి గంగాధర్, రాజు, దుర్గాదేవి పాల్గొన్నారు.

ఢిల్లీ ఐఐఏఇ లో సీటు సాధించిన ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పూర్వ విద్యార్థి వారధి వినయ్ శ్రీవంశీ

విశాలాంధ్ర-పాలకొల్లు: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్స్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలో ద్వారా ఢిల్లీ కళాశాల లో 4 సంవత్సరాల విద్య, శిక్షణలకు ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పూర్వ విద్యార్థి వంశీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్‌లో, వారధి వినయ్ శ్రీ వంశీని అభినందించారు. కోర్సు గూర్చి వివరిస్తూ ఐఐఏఇ ఢిల్లీ లో ప్రతి సం 60 మందిని ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేసి శిక్షణతో కూడిన విద్యను అందిస్తారని ఇందుకోసం వేలాది మంది పరీక్షకు హాజరు అవుతారని, అందులో ప్రతిభ తో సీటు సాధించినట్టు తెలిపాడు. స్కూల్ స్థాయి నుండి అందించిన శిక్షణ తనకు ఎంతగానో ఉపయోగపడింది అని అన్నారు. స్కూల్ డైరెక్టర్ మద్దాల వాసు మాట్లాడుతూ హైస్కూల్ స్థాయి నుండి పోటీపరిక్షల్లో ఇస్తున్న శిక్షణ వలన అధిక సంఖ్యలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని అన్నారు. ప్రిన్సిపాల్ వసంత లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి వంశీ క్రమశిక్షణతో చదివి తన లక్ష్యాన్ని అందుకున్నాడు అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఐ.టి ఫౌండేషన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వేగేశ్న అరుణ, ఉపాధ్యాయులు, విదార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం జగన్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-చాట్రాయి: గర్భవతులు ,బాలింతల ఆరోగ్యం కోసం పోషక విలువలు కలిగిన మంచి ఆహారాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ కి దక్కుతుందని పోలవరం పిఎసిఎస్ చైర్పర్సన్ చెలికానిబాబ్జి కొనియాడారు. శనివారం చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో వైఎస్ఆర్ పోషకాహారం కిట్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేస్తూ కొనియాడారు. ప్రతి ఒక్కరూ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో జెడ్పీటీసీలకు ప్రాధాన్యత

జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా పరిషత్ నిధులతో మండల పరిధిలో చేపట్టే పనులలో జెడ్పిటిసి సూచనలకు ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ లోని సమావేశపు హాలులో శనివారం జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జెడ్పిటిసి లు తమ పరిధిలోని గ్రామాలలో సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటికి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారుల ద్వారా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లా పరి షత్ ద్వారా మండల పరిధిలో చేపట్టే అభి వృద్ధి పనులలో స్థానిక జెడ్పిటిసిల సూచనలకు ప్రాధాన్యత ఇస్తామని, గ్రామాభివృద్ధి లక్ష్యంతో జిల్లా పరిషత్ ద్వారా గ్రామాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతా మన్నారు.గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి దిశగా తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని అంటు వ్యాధులు ప్రబల కుండా అన్ని గ్రామాలలో పూర్తి పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చూడాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీలలో విద్యా, వైద్యంకు సంబం ధించిన సదుపాయాలతో పాటు, మౌలిక సదుపా యాలు పూర్తి కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్, ఇళ్ళ వెంకటేశ్వర రావు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగ నాథరాజు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ నంబూరి తేజ్ భరత్, ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల వాసుబాబు, జిల్లా పరిషత్ సీఈఓ కె. రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, జెడ్పిటిసి లు, ఎంపిపి లు, ప్రభృతులు పాల్గొన్నారు.

బోధన అవసరాల మేరకే ధనుంజయరావు బదిలీ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : డాక్టర్ వైయస్ఆర్ హార్టికల్చర్ యూని వర్సిటీలో ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ధనుంజయరావును బోధన అవసరాల మేరకు, పరిశోధనల కొరకు వేరే ప్రాంతానికి బదిలీ చేయడం జరిగిందని యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ బి. శ్రీనివాసులు శనివారం ప్రకటనలో తెలిపారు. బదిలీని వ్యతిరేకిస్తూ డి హెచ్ పి ఎస్, కే ఎన్ పి ఎస్, కెవిపిఎస్ సంఘాల జిల్లా ప్రతినిధులు యూనివర్సిటీ పై అవగాహన లేకుండా అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు బదిలీ అయిన ధనుంజయరావు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్లే కుల వివక్షకు పాల్పడుతూ బదిలీ చేశారని ఆరోపిం చడం సరికాద న్నారు. గతంలో పలువురు డైరెక్టర్లను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశామని వాటిపై విమర్శలు లేవని రిజిస్ట్రార్ తెలిపారు. వైస్ ఛాన్సలర్ జానకిరామ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంలో, అవినీతికి పాల్పడ్డారని డి హెచ్ పి ఎస్, కే ఎన్ పి ఎస్, కెవిపిఎస్ సంఘాల జిల్లా ప్రతినిధులు చేసిన ఆరోపణలు ఎంత మాత్రం నిజం లేదన్నారు.

వికాస్ విద్యాసంస్థలపై విచారణ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని వికాస్ విద్యాసంస్థల యాజమాన్యం అక్కడ చదువుకున్న విద్యార్థులకు టీసీలు ఇవ్వడం లేదని ఇటీవల స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు పలువురు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ షరీఫ్ విచారణ నిమిత్తం జంగారెడ్డిగూడెం విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులను అధికారులు విచారించారు.వికాస్ విద్యా సంస్థల యజమాని జగన్ తమ పిల్లలకు ఇవ్వాల్సిన టీసీలను ఇవ్వాలని కోరగా ఫీజులు చెల్లించినా కూడా ఇంకా అదనంగా చెల్లించాలని తప్పుడు లెక్కలు చూపిస్తూ గత రెండు నెలలుగా టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఎన్నిసార్లు ప్రాధేయపడినా టీసీలు ఇవ్వకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని అధికారుల వద్ద ప్రాధేయపడ్డారు. విచారణ అధికారులు వికాస్ విద్యా సంస్థలలో విచారణ చేపట్టారు. మూడు రోజుల పాటు పాఠశాలకు కళాశాలకు జిల్లా విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండా సెలవులు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఏదైనా ప్రైవేట్ పాఠశాలకు సెలవు ఇవ్వాలంటే జిల్లా విద్యాశాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని, వ్యక్తిగతంగా పాఠశాలలకు సెలవు ప్రకటించరాదని ఏ.డి షరీఫ్ తెలిపారు.విచారణ అధికారులు విద్యార్థుల కు వెంటనే టీసీ లు ఇవ్వాలని వికాస్ విద్యా సంస్థల సిబ్బందికి తెలియచేయగా ఇస్తామని చెప్పి శనివారం ఇవ్వలేదని సోమవారం ఇస్తామని చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. ఈ విచారణలో జంగారెడ్డిగూడెం ఎంఈఓ బి. రాముడు, జిల్లా విద్యాశాఖ సి.ఎం.ఓ జే.రవీంద్ర, ఏలూరు విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకులు నరసింహారావు తదితరులు ఉన్నారు.

అప్పారావు కుటుంబాన్ని పరామర్శించిన పితాని

విశాలాంధ్ర-పెనుమంట్ర: టిడిపి సీనియర్ నాయకులు, సత్యవరం గ్రామ సర్పంచ్ చుక్కా అప్పారావు కుటుంబీ కులను సత్యవరం స్వగ్రామంలో శనివారం మాజీ మంత్రి, తెదేపా పొలిటికల్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని ఓదార్చి ,ధైర్యంగా ఉండాలని ఆయన అన్నారు. కర్రి అచ్యుత రామారెడ్డి, తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, కట్టా బాలాజీ వన్ కుమార్, కోణాల శ్రీనివాస్ రెడ్డి, దొంగ దుర్గాప్రసాద్, మైగాపుల రాము, వివేకానంద రెడ్డి, వెలగల మల్లి కార్జునరెడ్డి తోలేటి రాంబాబు, టిడిపి నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఆలమూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

విశాలాంధ్ర-పెనుమంట్ర: ఆలమూరు సచివాలయం పరిధిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటరులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కొడాలి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలోని వైద్య బృందం గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి లేవలేని స్థితిలో ఉన్న పేషంట్లకు వైద్య సహాయం అందించారు. వాతావరణంలో చోటు చేసుకునే మార్పులు ఫలితంగా సీజన్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు వచ్చే అవకాశం అధికంగా ఉందని ఇంటి పరిసర లను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడపోచిన నీటిని తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. అంగన్వాడీ కార్యాలయం నందు పిల్లలను పరీక్షించి తగిన మందులను అంద జేశారు. గర్భిణీ స్త్రీలను, బాలింతలను, మంచాన పడిన వృద్ధులను ఆరోగ్యశ్రీలో లబ్ధి పొందినటువంటి రోగులను పరీక్షించి వైద్యం అందించి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. అంగన్వాడి కార్యాలయంలో పిల్లలను పరీక్షించి తగిన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

కండ్ల కలకలు సోకితే ఇలా చేయండి

విశాలాంధ్ర-పాలకొల్లు: ప్రస్తుత సీజన్లో కండ్ల కలకలు చాలా ఎక్కువగా ఉన్నాయని, కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా కండ్ల కలకలకు దూరంగా ఉండవచ్చని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. నవ్య జీవన్ అన్నారు. కళ్ళు ఎర్రబడడం, పుసులు కట్టడం, కళ్ళనుండి నీళ్ల కారడం ప్రధాన లక్షణాలని తెలిపారు. రోజులో మొహాన్ని రెండు నుండి మూడు సార్లు శుభ్రపరచుకోవాలని, నీటిని ఎక్కువగా త్రాగాలని, అవసరమైన వైద్య సహాయం పొందాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెస్ట్ ఫీడింగ్ క్యాంపెయిన్

విశాలాంధ్ర-పాలకొల్లు: పట్టణంలోని పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం బ్రెస్ట్ ఫీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించారు. నోరా హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తల్లిపాలను బిడ్డ పుట్టిన వెంటనే ఇవ్వడం వల్ల కలిగే ఉపయోగాలను తల్లులకు విపులంగా వివరించారు. బిడ్డకు, పుట్టిన దగ్గర నుండి 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తల్లికి కూడా రొమ్ము క్యాన్సర్, అండాశయ కేన్సర్ రాకుండా కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సునీత, డాక్టర్ సాయి ప్రసన్న, విజయవాడ నూర హెల్త్ కోఆర్డినేటర్ డాక్టర్ శివ, ఆర్ఎంవో మూర్తి, నర్సింగ్ సూపర్డెంట్ విజయ్ కుమారి, హెడ్ నర్స్ సుజాత, ఫాతిమాభి పద్మావతి, నాగలక్ష్మి, నర్స్ శాంత కుమారి పాల్గొన్నారు.

సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడిగా శంకరం

విశాలాంధ్ర-దేవరపల్లి : సమతా సైనిక్ దళ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా దేవరపల్లి గ్రామానికి చెందిన మడతల శంకరంను రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శన నియమించినట్టు మడతల శంకరం తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దేవరపల్లికి చెందిన కొల్లి శ్యామ్ సుందర్ నియమించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పాతాళ శ్రీరామ్ మూర్తి, ప్రధాన కార్యదర్శి పోలుమాటి రామకృష్ణ, కోశాధికారి కరివేదన శేషగిరిరావు నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మడతల శంకరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లా పర్యటించి గ్రామస్థాయి నుండి కమిటీలు ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. తనకు జిల్లా పదవి ఇచ్చిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల్ని మోసగించడం బాధాకరం

విశాలాంధ్ర-గోపాలపురం: అధికారం ఉందని ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యంలో మొట్టికాయలు తప్పవని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దొడ్డిగార్ల సువర్ణరాజు అన్నారు. శుక్రవారం గోపాలపురం ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజధాని నిర్మాణం కొరకు భూములు ఇచ్చిన దాతలను, రైతులను మోసం చేసి రాజధాని నిర్మాణానికి పాటు పడకుండా ఆ ప్రాంత రైతులకు అన్యాయం చేయడం బాధాకర మన్నారు. గత ప్రభుత్వ హయాంలో 65 శాతం నిర్మాణం చేయగా గత 4 ఏళ్ళలో 10 శాతం కూడా పూర్తి చేయకపోవడం రాష్ట్ర ప్రజలను అవమాన పర్చడమే అని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పోసిన గణపతి, మండల కమిటీ సభ్యులు రామలీలధర్, గెర ఫణీంద్ర, గెడ్డాద సత్యనారాయణ, నాగేంద్ర, ప్రగాఢ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేయాలి

విశాలాంధ్ర - గోపాలపురం : సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్. శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆర్. శ్రీదేవి మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1సం నుండి 19 సంవత్సరాల లోపు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల లోని విద్యార్థిని విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేయాలని సూచించారు. హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5, 009 మంది, అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 8,870మందికి నులిపురుగుల మాత్రలను పంపిణీ చేయనున్నట్లు హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జె. శ్రీనివాస్, అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపి న్‌జిఓ జగ్గంపేట నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా పుష్పరాజు

విశాలాంధ్ర - గోకవరం: గోకవరం ఎంపీడీవో కె.పద్మజ్యోతి అధ్యక్షతన ఏపీ ఎన్‌జిఓ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఎన్‌జిఓ నియోజకవర్గ ప్రెసిడెంట్ వి.వి.వి. కృష్ణ, ఈఓపిఆర్.డి రాజేశ్వరరావు పాల్గొన్నారు. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్ 6 డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బత్తుల పుష్పరాజును ఏపీ ఎన్‌జిఓ జగ్గంపేట నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజవర్గం ప్రెసిడెంట్ కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలకు సంబంధించి పెండింగ్ బకాయిలు పిఆర్‌సిడిఎ, జిపిఎఫ్ సొమ్ములను ప్రభుత్వం సత్వరంగా విడుదల చేసి ఉద్యోగస్తుల అభ్యున్నతికి కృషి చేయాలని జగ్గంపేట నియోజకవర్గం యూనియన్ ప్రెసిడెంట్ వి. వి.వి.కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సి. హెచ్.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ పి.ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులు ఎస్.సునీత వర్మ, మహిళా అధ్యక్షులు పి.రోజా సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలన అంతానికి మహిళలు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవినీతి పాలనను అంతమొందించేందుకు మహిళలతో పాటు అన్ని వర్గాలు సిద్ధం కావాలని మండల తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు శరకణం కుమారి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ వీరంరెడ్డి కాశి బాబు,పలువురు టిడిపి నాయకులు అన్నారు. శనివారం కిర్లంపూడి మండలం రామకృష్ణపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ కంతా సరస్వతి,కంటా శ్రీను ఆధ్వర్యంలో మహిళా శక్తి ప్రచార రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు గ్యారెంటీ, టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ల దొంగబాబు, మహేంద్రాడ శ్రీలత, గంధం ఈశ్వరరావు, కంచుమర్తి రాఘువ, గుడాల రాంబాబు, దాడి గోవిందు, సూరిశెట్టి వెంకట శివ, గొడే బాల, కాకిలేటి రాయుడు, అధిక సంఖ్యలో మహిళ టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - నిడదవోలు : శ్రీ విరాట్ విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ లో స్వర్ణకారుల సంఘం సర్వసభ్య సమావేశంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత కార్యవర్గం పదవీకాలం ముగియడంతో నిడదవోలు పట్టణ స్వర్ణకారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా ర్యాలీ ఆనంద్, కార్యదర్శిగా అయినవిల్లి ఫణి కుమార్, కోశాధికారిగా తమిరి సతీష్‌లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కూనవరంలో తోట సత్యనారాయణ జయంతి

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : కీ.శే. డాక్టర్ తోట సత్యనారాయణ 59వ జయంతిని పురస్కరించుకుని శనివారం కూన వరంలో వేడుకలను జరిపారు. గ్రామస్తులచే నిర్మించిన సత్యనారాయణ విగ్రహానికి సిహెచ్ వరలక్ష్మి గేదెల రమేష్ నాయకులు గ్రామస్తులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులైన తోట సోదరులు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని గ్రామస్తుల సహకారంతో ప్రారంభించారు. ప్రత్యేక వైద్య పరిక రాలను ఏర్పాటు చేసి డాక్టర్‌లు తోట రాజ్య లక్ష్మి, తోట సిద్దార్ధ, తోట సందీప్, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేసారు. గ్రామస్తులేకాక ఇతర గ్రామాల నుండి సుమారు రెండు వేల మంది వివిధ రోగాలతో బాధ పడుతున్నవారు విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పినిపే జయరాజు, ఆకుల రామారావు, ఊటాల రామాంజ నేయులు, అయితాబత్తుల వెంకట కృష్ణారావు, పెయ్యల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ ద్వారా పిల్లలకు ఆరోగ్యం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం పరిధిలోని ఊబలంక, గోపాలపురం పిహెచ్‌సిల పరిధిలోని ప్రతి స్కూలులో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 10వతేదీన జరుగనున్న యన్‌డిడి జాతీయ నులి పురుగులు నివారణ కార్యక్రమంలో భాగంగా, పిహెచ్‌సి ఏరియాలో ఉన్నటువంటి 2- 19 సంవత్సరాల పిల్లలకు నులిపురుగుల నివారణకు మందుల పంపిణీపై కార్యక్రమ నిర్వహణపై ఎంపిడిఓ అధ్యక్షతన టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ప్రతి విద్యార్థి తప్పక ఆల్బెండజోల్ 400ఎంజి టాబ్లెట్లు మ్రింగేటట్లు చూడాలని, అంగనవాడి పిల్లలకు ఇచ్చేటప్పుడు తల్లుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించాలని ఎంపిడివో తెలియజేశారు. డాక్టర్ హసీనా మేడం మాట్లాడుతూ ప్రతివిద్యార్థి తప్పక ట్యాబ్లెట్ మ్రింగేటట్లుగా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ రాజేంద్రప్రసాద్, డాక్టర్ హసీనా, ఎంఈఓ శ్రీనివాసరాజు, అంగన్వాడీ సూపర్ వైజర్ హిమశ్రీ, ఎంపిహెచ్ ఈఓ బిషప్ తదితరులు పాల్గొన్నారు.

“ఆదిత్య సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరాంజనేయులుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్) కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఐత వీరాంజనేయులుకి “ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,గుంటూరు” నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (డాక్టరేట్) పొందినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. డాక్టర్ వి.చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో ఐత వీరాంజనేయులు సమర్పించిన శీర్షిక “ఎ జెడ్ 31/ ఎస్ఐసి/ గ్రాఫిటీ రీన్‌ఫోర్స్ మెటల్ మ్యాట్రిక్స్ హైబ్రిడ్ మిశ్రమాలపై ఫాబ్రికేషన్, క్యారెక్టరైజేషన్ మరియు ట్రైబోలాజికల్ అధ్యయనాలు” అనే అంశం పై థీసిస్ సమర్పించినందుకు గాను ఈ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డాక్టర్ ఐత వీరాంజనేయులు తన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషా రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ & ప్రిన్సిపాల్ డా ఎమ్ శ్రీనివాస రెడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ప్రీతమ్ కుమార్ దాస్, వివిధ విభాగాధిపతులు, మెకానికల్ స్టాఫ్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

చంద్రబాబు పర్యటనపై టీడీపీ సమావేశం

విశాలాంధ్ర - సీతానగరం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు సీతానగరం మండలంలో పర్యటన పై రాజానగరం నియోజకవర్గ ఇంఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మండల టీడీపీ నాయకులతో శనివారం రఘుదేవపురం గ్రామంలో సాయి బాబా గుడి వద్ద గల కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 8వ తేదీన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పురుషోత్తపట్నం గ్రామంలో గల పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం సందర్శించనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయడం కోసం టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఇంచార్జి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ చంద్రబాబు పర్యటన విజయవంతమయ్యేలా టీడీపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తజన సంద్రమైన వాడపల్లి క్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఏడు శనివారాల వాడపల్లి వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో అశేష భక్తజనుల పూజలందుకుంటున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. వేకువజామునుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు పూర్తిచేసి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి సుప్రభాత సేవ, తొలి హారతి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. దేవస్థానం ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం రోజున ప్రత్యేక దర్శనం ద్వారా ఆదాయం రు.20,01,350, అన్నప్రసాద విరాళం ఆదాయం రు.2,97,761, , సేవలు వల్ల ఆదాయం రు.37,100, లడ్డూ విక్రయిం రు.4,90,620, విరాళములు ద్వారా ఆదాయం రు.5,933 వెరసి రు.28,28,714 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

విశాలాంధ్ర - సామర్లకోట : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థన మందిరంలో 30వ తేదీ నుండి 5వ తేదీ వరకు ప్రతిరోజు జరుగుతున్న హనుమాన్ చాలీసా పారాయణంలో భాగంగా శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు హాజరై పూజలు నిర్వహించారు. స్వామి వారి ఫోటో తీర్థప్రసాదాలు స్వీకరించి భక్తులు ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆదివారం శ్రీ విజయరాజ రాజేశ్వరి విద్యాపీఠాధిపతులు వాసుదేవానందగిరి స్వాముల వారిచే శ్రీ సువర్చల ఆంజనేయ స్వామి వారి కళ్యాణం నిర్వహించబడునని పై కార్యక్రమాలు శ్రీ వాసవి ఉత్సవ కమిటీ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవి యూత్ అండ్ ఫ్రెండ్స్, వాసవి వనిత క్లబ్ వాసవి కపుల్స్ క్లబ్ భీమేశ్వర ఆధ్వర్యంలో నిర్వహించబడని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థన మందిరం అధ్యక్షులు కటకం కృష్ణ సృజన్ తెలియజేశారు.

శ్రీ వేంకటేశ్వర కళ్యాణ ఉత్సవం

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్ళపూడి లోని షిర్డీ సాయి ఆలయ ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ ఉత్సవాన్ని గోపవరం గ్రామ మహిళ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్య లో మహిళలు పాల్గొని కీర్తనలు ద్వారా గానామృతాన్ని వినిపించారు. అనంతరం స్థానిక ఆలయ కమిటీ అధ్యక్షులు సింహాద్రి జనార్దన్ రావు సహకారంతో కళ్యాణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులను ఎంతో ఆకట్టుకుంది.